


## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

**మైత్రి, త్రిభువన్ మొదలయిన వాళ్ళు** రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి సరాసరి ఫేక్టరీకి వచ్చారు. అంతా కలసి బెనర్జీ గదిలోకి వెళ్ళారు.

"ఏవిటంతా కట్టకట్టుకుని వచ్చారు?" గర్జించాడు బెనర్జీ.

మైత్రి మౌనంగా కాగితం అతనికిచ్చి చెప్పింది.

"సర్టిఫికెట్ రావడానికి వారం పడుతుంది. ది మోడ్రన్ ఫుడ్స్ వర్కర్స్ యూనియన్ స్థాపించాం. ఇది దాని తాలూకు రశీదు"

"ఎవర్నడిగి ఈ పని చేసారు? ఎందుకు చేసారు?"

"వర్కర్స్‌ని అడిగి, మా బాగోగులకోసం" జవాబు చెప్పింది మైత్రి.

"ఎంత ధైర్యం నీకు?"

"చాలా. మా యూనియన్‌కి త్రిభువన్ ప్రెసిడెంట్" చెప్పింది మైత్రి.

"ఆఫీస్ టైంలో యూనియన్ ఆఫీస్‌కి వెళ్ళారు. ఇవాళ మీరు పనిలో చేరడానికి వీల్లేదు"

మెత్తగా నవ్వింది మైత్రి.

"మిస్టర్ బెనర్జీ, మీరు లేబర్ రూల్స్ తెలిసిన వెల్ఫేర్ ఆఫీసర్‌ని అపాయింట్ చేసుకోవాల్సిన రోజొచ్చింది. యూనియన్ పని మీద తిరిగితే, ఆ రోజు డ్యూటీలో ఉన్నట్లే లెక్క. కొంతకాలం ఇక మీదట త్రిభువన్ డ్యూటీకి సరిగ్గా హాజరు కాకపోవచ్చు" చెప్పింది.

"మా యూనియన్ కో ఆఫీస్ కావాలి. అది ఫేక్టరీ ప్రెమిసిస్‌లో ప్రొవైడ్ చేయాల్సిన బాధ్యత మీమీద ఉంది." చెప్పాడు త్రిభువన్.

పళ్ళు పటపట కొరికాడు బెనర్జీ.

"మీ అందర్నీ ఈ క్షణం నుంచి సస్పెండ్ చేస్తున్నాను. చూసుకోండి ఆ నోటీసులు. నోటీస్ బోర్డ్ మీద అతికించారు."

"మా యూనియన్ కో నోటీస్ బోర్డు కావాలి. ఏ ఛార్జెస్ మీద సస్పెండ్ చేస్తున్నారు?" అడిగింది మైత్రి.

"స్టాక్ బుక్‌లో చాలా తప్పులున్నాయి. వాటిని నువ్వు సరిగ్గా మెయిన్ టెయిన్ చేయక, ఆఫీస్ టైంలో సీట్‌లో ఉండటం లేదు" చెప్పాడు అంతదాకా మౌనంగా ఉన్న విశ్వం.

"ఆ సంగతి మేం వర్కర్స్ యూనియన్ స్థాపించిన రోజే మీకు గుర్తొచ్చిందా?" అడిగాడు త్రిభువన్ వెటకారంగా.

"గెటౌట్! ఆల్ ఆఫ్ యు గెటౌట్" అరిచాడు బెనర్జీ.

"మీరు సిగరెట్ తాగుతున్నారు" అడిగింది మైత్రి బెనర్జీని.

"నా ఇష్టం! నువ్వెవరు అడగడానికి? ఇక ఈ కాంపౌండ్‌లోకి అడుగు పెట్టకండి."

"మమ్మల్ని సస్పెండ్ చేస్తే వర్కర్స్ వెంటనే స్ట్రయిక్ చేస్తారు" చెప్పాడు త్రిభువన్.

"ఎంతమంది చేస్తే అంతమంది చేయండి. మిగిలిన వాళ్ళతో ఫ్యాక్టరి ఎలా నడపాలో నాకు తెలుసు" అరిచాడు బెనర్జీ.

"అలాగే రన్ చేయండి. చూస్తాం ఏ రోబట్స్‌ని తెచ్చి నడిపిస్తారో" చెప్పింది మైత్రి.

"ముందర మీరంతా బయటకి నడవండి. పదండంతా"

అంతా బయటకి నడవసాగారు, కోపంతో ఎర్రబడ్డ మొహాలతో.

బెనర్జీ మైత్రితో చెప్పాడు "మైత్రీ! నువ్వు మాత్రం ఉండు. నీతో పనుంది."

"ఏం పని? నేను రహస్య బేరాలకి లొంగేదాన్ని కాను." 'వర్కర్స్ యూనియన్ జిందాబాద్' అని అరుస్తూ బయటికి వెళ్ళారు.

"ఆ మైత్రితో నాకు పనుంది. లోపలికి రమ్మను" చెప్పాడు బెనర్జీ సింహాచలంతో.

"వాళ్ళతో బేరాలెందుకు? మనం అసమర్ధులం అనుకుంటారు" చెప్పాడు విశ్వం.

"బేరంలేదు. గీరంలేదు. అది పూర్తిగా వ్యక్తిగతం." చెప్పాడు బెనర్జీ అసహనంగా.

సింహాచలం బయటకి వెళ్ళాడు. త్రిభువన్ బయటకి వచ్చి, అక్కడ సమావేశమయిన వర్కర్స్‌తో లోపల జరిగింది చెప్పాడు.

"ఫ్రెండ్స్! మనం అన్నిటికీ తెగించే ఈ యూనియన్ స్థాపించాం. ఏ యూనియన్ కయినా సరే ఐకమత్యమే బలం. అసలు యూనియన్ అంటేనే కలయిక అని అర్థం. ఈ తప్పుడు సస్పెన్షన్స్ విరమించుకుని, మనం ఇవ్వబోయే ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్‌కి మేనేజ్‌మెంట్ ఒప్పుకోకపోతే సమ్మెకి నోటీస్ ఇద్దాం. ఆదిలోనే హంసపాదు పడకుండా పోరాడుదాం. మేనేజ్ మెంట్ బెదిరింపు చర్యలకి భయపడి ఈ యూనియన్‌ని మొగ్గలోనే తుంచెయ్యబడకుండా చూసే బాధ్యత మనందరి మీదా ఉంది."

కొందరు 'వర్కర్స్ యూనియన్ జిందాబాద్' అన్న నినాదాలు చేసారు.

సింహాచలం వచ్చి మైత్రితో చెప్పాడు బెనర్జీ పిలుస్తున్నాడని.

"యూనియన్ పని కాదుట. పర్సనల్ అని చెప్పమన్నారు" వంకరగా నవ్వుతూ చెప్పాడు సింహాచలం.

"పర్సనల్ పనయితే ఫేక్టరీ బయట కలవమన్నానని చెప్పండి" జవాబు చెప్పింది మైత్రి కఠినంగా చూస్తూ.

యూనియన్ లీడర్స్, వర్కర్స్ ఓ పావుగంట సేపు తర్జన భర్జన పడ్డాక సస్పెండ్ చేయబడ్డ వాళ్ళంతా బయటకి వెళ్ళాలని, మిగతా వర్కర్స్ పన్లలోకి వెళ్ళాలని నిర్ణయించారు.

తనని అక్రమంగా సస్పెండ్ చేసినందుకు లేబర్ కోర్టులో వెంటనే మేనేజ్‌మెంట్ మీద సూట్ ఫైల్ చేయాలని నిర్ణయించాడు త్రిభువన్. అతనా ఏర్పాట్లు చూడటానికి ఇద్దర్ని సాయం తీసుకుని వెళ్ళాడు.

మైత్రి ఫేక్టరీలోంచి బయటకి వచ్చాక ఎటెళ్ళాలా అని ఆలోచించింది. ఇంటికెళ్ళే బస్సెక్కింది.

దారిలో బాంబే డైయింగ్ రిటైల్ షోరూమ్ ముందున్న ఇరవై శాతం డిస్కౌంట్ సేల్స్ బోర్డుని చూసి వెంటనే బస్సులోంచి దిగింది.

ఆ షాపులోకి నడిచింది. సుధీర్ కోసం మంచి షర్ట్‌పీస్‌ల కోసం వెదకసాగింది. ఆమె దృష్టి ఓ పీస్ మీద పడింది.

"అది చూపించండి" చెప్పింది సేల్స్‌మేన్‌తో.

"సారీ మేడం. దాన్ని అమ్మేసాం" చెప్పాడతను.

"మొత్తం?"

"అది తాను కాదు. అందులో ఒక షర్ట్‌కి సరిపడే ఉంది. "

"అలాంటిది ఇంకో తాను లేదా?" అడిగింది మైత్రి.

"లేదు. ఇది చూస్తారా? అదే షేడ్ బావుంటుంది."

"వద్దు" చెప్పింది మైత్రి నిరుత్సాహంగా.

పేంట్ పీస్‌లు చూస్తూ వాళ్ళ సంభాషణ విన్న, ఆ షర్ట్‌పీస్ కావాలన్న ఆమె సేల్స్‌మేన్‌తో చెప్పింది.

"పోనీ ఆమెకే ఇవ్వండి"

"మీరు ఉంచమన్నారుగా?" అడిగాడు సేల్స్‌మేన్ సందిగ్ధంగా.

"ఆమె ముచ్చట పడుతోందిగా?"చెప్పిందామె.

మైత్రి ఇంకా అలా గుర్తుపట్టనట్లుగా చూస్తూండటంతో చెప్పిందామె.

"మనం అయిదు రోజుల క్రితం ట్వంటీ ఫస్ట్ సెంచరీ సూపర్ బజార్‌లో కలిసాం. నా ట్రాలీతో మీ ట్రాలీని చూసుకోకుండా కొట్టాను."

"ఓ..మీరా? గుర్తొచ్చారు, మెనీ మెనీ థాంక్స్. ఆ చొక్కా పీస్‌ని త్యాగం చేసినందుకు" నవ్వింది మైత్రి పలకరింపుగా.

"బైదివే, నా పేరు అనసూయ. మీ పేరు?" అడిగింది అనసూయ మైత్రిని.

"మైత్రి" తన పేరు చెప్పింది మైత్రి అనసూయకి.

"అయితే ఈ షర్ట్ పీస్ ఈమెకిమ్మంటారా?" అడిగాడు సేల్స్‌మేన్ ఆమెను.

"ఇవ్వు ఫర్వాలేదు" చెప్పింది అనసూయ.

"థాంక్స్" చెప్పింది మైత్రి.

"యు ఆర్ వెల్ కం" చెప్పింది అనసూయ చిరునవ్వుతో.

మైత్రి ఆ షర్ట్ పేక్ చేయించుకుని పేంట్ కోసం చూడసాగింది.

అనసూయ వెళ్ళిపోయింది.

●●●

మైత్రి ఇంటికి వెళ్ళేసరికి శ్యామలాంబ కూతురు సుచరిత, పిల్లలు పేకాట ఆడుకుంటున్నారు. సుచరిత మైత్రిని చూడగానే ముఖం తిప్పుకుంది. ఆమెకి మైత్రి ఆ గదిలో ఉండటం ఇష్టంలేదు. దాన్ని తల్లి గెస్ట్ రూంగా ఉంచేసి, తన భర్త వచ్చినప్పుడు అది వాళ్ళకి ఇచ్చి, రాత్రిళ్ళు పిల్లల్ని తల్లి తన పక్కలో పడుకోపెట్టుకోవాలన్నది సుచరిత కోరిక.

"హలో గుడీవినింగ్" పలకరించింది మైత్రి ఆమెని.

సుచరిత సమాధానం చెప్పలేదు. శ్యామలాంబ మైత్రికి టీ కలిపి తీసుకువచ్చింది.

"సుధీర్ వచ్చే టైం అయింది. బోర్నవిటా కలిపి ఫ్లాస్క్‌లోపోసాను" చెప్పింది శ్యామలాంబ.

సుచరిత భర్తవచ్చి చెప్పాడు సినిమాకి టిక్కెట్లు కొన్నానని భార్యని పిల్లలనీ బయలుదేరమని. సుచరిత ఆదరాబాదరాగా తయారై అతని వెంట వెళ్ళింది. వాళ్ళు వెళ్ళాక చెప్పింది శ్యామలాంబ నవ్వుతూ.

"నిన్ను గది ఖాళీ చేయించమని ఒకటే గొడవ చేస్తోంది"

మైత్రి బదులుగా చిన్నగా నవ్వింది కానీ సమాధానం చెప్పలేదు.

"మా అల్లుడు, కూతుళ్ళతో వేగలేకపోతున్నాం. వచ్చేటప్పుడు ఏం తీసుకు రాదు. సబ్బు, పేస్ట్, బ్రష్, టవల్. ఒకటేమిటి అన్నీ నేనే కొనాలి. వెళ్ళేటప్పుడు వాటిని పట్టుకుపోతుంది. మాకా ఇవన్నీ కొనే స్తోమత లేదు. ఆ మాటంటే కోపం. అసలిదంతా అల్లుడు ప్రోద్భలమే అయివుండాలి" చెప్పింది శ్యామలాంబ.

"కొందరు అతిథులంతే" చెప్పింది మైత్రి. కాలింగ్ బెల్ మోగింది. బెనర్జీ అయివుంటాడనుకుని తలుపు తెరిచింది. బెనర్జీ కాదు పక్కింటివాళ్ళు. కరివేపాకు కోసుకోవచ్చా అని అడగడానికి.

బాత్ రూంలోకి వెళ్ళి, మొహం కడుక్కుని, బొట్టు పెట్టుకుని బట్టలు మార్చుకుంది మైత్రి. మళ్ళీ కాలింగ్ బెల్ మోగింది. సుధీర్ అయివుంటాడనుకుని తలుపు తెరిచింది.

సుధీర్ కాదు. బెనర్జీ. అతని తీరు చూస్తే కోపంతో మండిపడుతున్నాడని గ్రహించి చెప్పింది మైత్రి. తలుపు పూర్తిగా తీయకుండా.

"చూడు బెనర్జీ. ఇది నా ఇల్లు కాదు. మొన్నటిలా అరిచి గొడవ చేయాలనుకుంటే లోపలికి రాకు. బయటకెళ్ళి నీ కారులో కూర్చుందాం. శాంతంగా మాట్లాడాలనుకుంటే రా"

"తలుపు తెరు" చెప్పాడతను.

ఇద్దరూ మైత్రి గదిలోకి వెళ్ళారు. కూర్చున్నాక ఆమె అడిగింది.

"ఏం నిర్ణయించుకున్నావ్?"

"నిన్ను తీసేయాలని"

"ఫేక్టరీ విషయాలు అక్కడ మాట్లాడు. ఇక్కడ సుధీర్ గురించి మాట్లాడితే చాలు"

"దానికీ, దీనికీ లంకే? నన్ను బ్లాక్ మెయిల్ చేద్దామనుకుంటున్నావా?" తీవ్రంగా చూస్తూ అడిగాడు బెనర్జీ.

"నిన్ను బాంబే మెయిల్ చేద్దామనుకున్నా కాలేవు. ఊరికే అన్నీ ఊహించుకోకు. నిన్న ఆఫీస్‌కి రాలేదే?" అడిగింది నవ్వి.

"అది నీకనవసరం"

"ఆల్‌రైట్. ఇందాకటి ఫేక్టరీ విషయమే మాట్లాడుదాం. నన్ను ఉద్యోగంలోంచి తీసేసావు. ఓ.కే. ఆ తర్వాత?" అడిగింది.

"సుధీర్‌ని దత్తత చేసుకుంటాను"

"అందుకు నేను కొన్ని షరతులు చెప్పాగా?"

"అవి నేను ఆచరించగలిగేవి కావు"

"నువు ఏం అనుకుంటే అది సాధించగలవు. మైత్రిలాంటి అమ్మాయిని మభ్యపెట్టగలిగావు. ఇదో లెక్కా?"

"ఇంకా విషయం మాట్లాడక"

"ఓ.కే. అయితే సుధీర్ నా దగ్గరే పెరుగుతాడు"

"కానీ వాడు నా కొడుకు"

"నా కొడుకు కూడా"

"నీ దగ్గర పెరిగి ఏం బావుకుంటాడు? నెలకో బట్టల జత కుట్టించగలవా? ఖరీదైన స్కూల్‌లో చేర్పించగలవా? రోజుకో ఐస్ క్రీం పక్కనుంచు. కనీసం ఓ కేడ్‌బరీస్ చాక్‌లెట్ అయినా కొనివ్వగలవా? నా దగ్గర పెరిగితే, బెస్ట్ ఎడ్యుకేషన్, బెస్ట్ లైఫ్, బెస్ట్.."

"బెస్ట్‌ల లిస్ట్‌కి ఫుల్ స్టాప్ పెట్టు. సుధీర్ నీకన్నా నాకే ఎక్కువ. ఎక్కడున్నావు నీవు? అర్ధరాత్రి చిన్న బిడ్డ గుణం వచ్చినప్పుడు, మీజిల్స్‌తో సుధీర్ మూసిన కళ్ళు తెరవకుండా పక్కమీద పడి ఉన్నప్పుడు ఎక్కడున్నావు? అసలు వాడీ లోకంలోకే రాకుండా ఉండాలని కోరుకున్నావు నువు. అట్టే మాట్లాడి పుత్ర ప్రేమని ఒలకపొయ్యక" ఉద్రేకంతో చెప్పింది మైత్రి.

ఇద్దరూ కాసేపు మాటాడలేదు.

"నీ బతుకుని నువు మార్చుకోలేనంత కాలం సుధీర్ గురించి మర్చిపో"

"ఆల్‌రైట్"

వెంటనే లేచి నిలబడ్డాడు బెనర్జీ కోపంగా.

"వెళుతున్నాను." చెప్పాడు.

"మధురమయిన రమ్ దగ్గరకా, లేక అంగుళంన్నర సిగరెట్ దగ్గరకా?" వెటకారంగా అడిగింది మైత్రి.

"ఆ రెండింటి దగ్గరకి. నీకవి లేవని, రావని ఉక్రోషం" కసిగా చెప్పాడు బెనర్జీ.

వెంటనే గలగల నవ్వి చెప్పింది మైత్రి.

"చిన్నతనంలో నీకు ఉక్రోషం, కోపం ఎలా ఉండేవో ఇప్పుడు స్వయంగా చూసాను. ఒక్క నిమిషం ఉండు"లేచి బయటకి వెళ్ళింది.

బెనర్జీ జేబులోంచి సిగరెట్ పాకెట్, లైటర్ తీసి సిగరెట్ వెలిగించుకున్నాడు. రెండు నిముషాల్లో చేతిలో టీ కప్పుతో వచ్చింది మైత్రి.

"అతిధి మర్యాద అంతే తీసుకో"

"అవసరం లేదు,"

"టీ తాగాక సిగరెట్ అవసరం ఎలాగూ ఉంటుంది. ముందీపని చేసి తర్వాత ఆ పని చెయ్యి"

బెనర్జి సిగరెట్‌ని ఊపిరితిత్తులనిండా పీల్చి, మైత్రి దగ్గరకి వెళ్ళి ఆమె మొహంలోకి పొగని వదిలి చెప్పాడు.

"నా జీవితం నా ఇష్టం. నన్నేదో ఉద్దరించడానికి కంకణం కట్టుకున్న పోజు ఆపు. ఈ లోకంలో నన్నెవరూ కంట్రోల్ చేయలేరు అన్న ఒక్కాయన పోయారు. అండర్ స్టాండ్?"

"అండర్ స్టుడ్" చెప్పింది మైత్రి.

"అలా అర్థం చేసుకునే ఉండు బై" చేతిలోని సిగరెట్ నేలకేసి కొట్టి గబగబ బయటికి నడిచాడు బెనర్జీ. అతన్ని ఆపాలని అనుకుంది కానీ మైత్రి తనని తాను కంట్రోల్ చేసుకుంది.

బెనర్జీ వెళ్ళిన పావుగంటకి వచ్చాడు సుధీర్. ఆ కుర్రాడిచేత హోం వర్క్ చేయిస్తున్నా మైత్రి తలనిండా రకరకాల ఆలోచనలు.

## 10

కృష్ణవేణి పంపిన ఎల్.ఆర్.తో లారీ పార్సెల్ సర్వీస్‌లో వచ్చిన బండిల్‌ని విడిపించుకున్నాడు. కృష్ణవేణిని అధికంగా ఆరాధించిన ఒకతను దాన్ని ఇంటికి తీసుకువచ్చి విప్పి చూస్తే అయిదువందల వాల్ పోస్టర్స్. వాటిని అతికించమని కోరింది కృష్ణవేణి. ఆ వాల్ పోస్టర్స్‌లో ఏం వేయిస్తున్నావని అడిగితే నవ్వి 'రహస్యం' అన్నది కాని చెప్పలేదు.

అందుకే ఆసక్తిగా చూశాడు. అందులోని ఫోటో చూసి, మేటర్‌ని చదివి ఆశ్చర్యపోయాడు.

బెనర్జీ ఫోటో ఉంది. తెలుపు నలుపుల్లో ఫోటో కింద ఇలా ఉంది.

పేరు: బెనర్జీ

వృత్తి: మేనేజింగ్ డైరెక్టర్, మోడన్ ఫుడ్ ప్రాడక్ట్సు (ప్రైవేట్) లిమిటెడ్

ప్రవృత్తి: నపుంసకుడు.

ఇందుకు హామీ: అనేకమంది ఆడపిల్లలు.

అతను కృష్ణవేణి చర్యకి ఆశ్చర్యపోయాడు. బెనర్జీ చేసిన మోసం గురించి కృష్ణవేణి అతనికి ఓసారి చెప్పింది. ఆమెకి అందుకు అతని మీద అంత పగ ఉందని, అందుకు ఇలా ప్రతీకారం తీర్చుకుంటుందని కృష్ణవేణి గురించి బాగా తెలిసిన అతను అనుకోలేదు. కృష్ణవేణిని అతను ఎన్నడూ ఆవిధంగా రియాక్ట్ అవుతుందని అంచనా వేయలేదు.

ఆ పోస్టర్‌ని చదివిన ప్రతివాళ్ళు కొంతలో కొంత అది నిజమనుకుంటారు. అందువల్ల బెనర్జీ అందరిలో నవ్వులపాలయ్యే అవకాశం ఉంది. అప్పుడర్థమయిందతనికి తను పంపే పోస్టర్స్‌ని రహస్యంగా అతికించే ఏర్పాటు చేయాలని కృష్ణవేణి ఎందుకు కోరిందో. అందుకయే ఖర్చు తనే ఇస్తానంది కానీ అతను వద్దన్నాడు.

కృష్ణవేణి పగచల్లారే ఆమె కోరికని తీర్చడానికే నిర్ణయించుకున్నాడతను. ఆ అర్ధరాత్రి ఆ పోస్టర్స్‌ని ఇద్దరు నగరంలో అతికించసాగారు. కొన్ని ఫేక్టరీ గేటుకి, చుట్టుపక్కల, మరికొన్ని బెనర్జీ ఇంటి కాంపౌండ్ వాల్‌కి, చుట్టుపక్కల.

గంటలో పని రహస్యంగా, సక్రమంగా జరిగిపోయింది.

●●●

కాన్వెంట్ అవగానే సుధీర్ ఎప్పటిలా బయటకి వచ్చి ఇంటివైపు నడవసాగాడు. అతను కొద్దిదూరం వెళ్ళాక పక్కనే ఆగిందోకారు.

ఆ కారు తన పక్కనే తను నడిచే వేగంతో తనతో సమానంగా పేవ్‌మెంట్ పక్కనే రావడం గమనించి తలతిప్పి చూసాడు సుధీర్.

కారులో డ్రైవింగ్ సీట్‌లో బెనర్జీ కూర్చుని ఉన్నాడు.

"హలో" పలకరించాడు బెనర్జీ. సుధీర్ వంక చూస్తున్నాడు.

"హలో అంకుల్" పలకరించాడు సుధీర్.

"ఇంటికా?"

"అవును?"

"నేనూ అటే. రా. ఎక్కు" కారు ఆపాడు బెనర్జీ.

"వద్దంకుల్. నేను నడిచి వెళతాను."

"మరేం ఫర్వాలేదు రా"

ముందు సీటు పక్క తలుపు తెరిచాడు బెనర్జీ.

"వద్దంకుల్, నేను నడిచి వెళతాను"

"మరేం ఫర్వాలేదురా"

ముందు సీటు పక్క తలుపు తెరిచాడు బెనర్జీ. తటపటాయిస్తున్న సుధీర్‌తో చెప్పాడు.

"కమాన్ మై బాయ్"

"మా అమ్మకి తెలుస్తే కోప్పడుతుంది."

"దేనికి? నేనేం కొత్తవాణ్ణి కానుగా"

"మా అమ్మ మీరు పిలిచినా మీ కారు ఎక్కద్దని చెప్పింది.

వెంటనే బెనర్జీ కనుబొమలు పైకిలేచాయి.

"అలాగా? నే చెప్తాలే మీ మమ్మీకి. ఏం అనదు. కమాన్ ఐసే"

"వద్దండి"

"రమ్మంటూంటే"

బెనర్జీ పక్కకి వంగి సుధీర్ చేతిని పట్టుకుని బలవంతంగా లాగాడు. వద్దంటూ గుంజుకుంటున్న సుధీర్‌ని బలవంతంగా ఫ్రంట్ సీట్‌లోకి లాగి తలుపులేసి లోపల లాక్‌చేసాడు. తలుపు తెరవడానికి హేండిల్‌ని లాగాడు. కానీ తలుపు తెరుచుకోలేదు. సుధీర్‌కి తెలీదు ఆ మారుతీ కారు తలుపుకి లోపల వేసిన లాక్‌ని ఎలా తెరవాలో.

చిన్నగా నవ్వి చెప్పాడు బెనర్జీ.

"అది తెరచుకోదు. ఇకనుంచి నే చెప్పినట్లు వినాలి అర్థమయిందా?"

"నన్ను దిగిపోనివ్వండి" చెప్పాడు సుధీర్ ఏడుపుగొంతుతో.

సమాధానంగా బెనర్జీ కారుని ముందుకి పోనిచ్చాడు. క్షణాల్లో ఆ కారు వేగం అందుకుంది.

●●●

"ఇంకా సుధీర్ రాలేదే?" గోడ గడియారం వంక చూసి అడిగింది శ్యామలాంబ.

"ఇంకో పావుగంట చూద్దాం" చెప్పింది మైత్రి.

మైత్రికి ఏదైనా జరిగివుంటుందన్న భయం ఎంతమాత్రం కలగలేదు. వస్తూ దారిలో ఏ గారడీనో చూసి ఆగివుంటాడనుకుంది. కానీ సుధీర్ వచ్చే సమయం దాటి గంటంపావు అవడంతో మొదటిసారిగా మైత్రికి భయం వేసింది, ఏదయినా అయి ఉండచ్చని. బయటకి వెళ్ళే చీరకట్టుకుని మొహం కడుక్కుని బొట్టు పెట్టుకుని కూడా ఓ పావుగంట ఆగి చూసింది.

సుధీర్ రాకపోవడంతో సుధీర్ చదివే స్కూల్ కి బయలుదేరింది. స్కూల్ మూసేసి ఉంది. సుధీర్ చదివే క్లాసు తలుపుకి తాళం వేసి ఉంది.

"ఎవరు కావాలి?" అడిగాడు వాచ్ మెన్ మైత్రి దగ్గరకి వచ్చి సుధీర్ గురించి అడిగింది.

"పిల్లలంతా వెళ్ళి గంటన్నర దాటింది. స్కూల్లో ఎవరూ లేరు" చెప్పాడు వాచ్‌మెన్. స్కూల్ నుంచి ఇంటికి నడిచి వెళుతూ దారిలో సుధీర్ ఎక్కడయినా కనబడతాడేమోనని చూసింది. 'ఈపాటికి ఇంటికి చేరుకుని ఉంటాడు' అన్న ధైర్యంతో బెల్ నొక్కింది. తలుపు తెరిచిన శ్యామలాంబ "సుధీర్ ఏడి?" అని అడగడంతో ఆమె గుండెల్లో రాయిపడ్డట్టయ్యింది.

"ఇంకా రాలేదా? స్కూల్లో లేడు" చెప్పింది.

మైత్రిలోని అధైర్యాన్ని గమనించి చెప్పింది శ్యామలాంబ.

"ఆడుకోడానికో, పుట్టినరోజు పార్టీకో ఏ ఫ్రెండింటికో వెళ్ళి ఉంటాడు. వచ్చేస్తాడు."

"నాతో చెప్పకుండా అలా ఎవరిళ్ళకి వెళ్ళడు."

"ఇదే మొదటిసారి అయివుంటుంది. ఇంకో అరగంటలో వచ్చేస్తాడు? చూద్దాం"

ఆ అరగంట మైత్రి ఎంతో బాధాకరంగా గడిపింది. ఏమయ్యాడు? ఏక్సిడెంట్ అయి ఉండదు. అయితే దారిలో పోలీసులు కనబడి ఉండేవారు. ఎక్కడికి వెళ్ళాడు? ఏమయి ఉంటాడు? మైత్రి ఆలోచనలు పరిపరివిధాల పోయాయి.

అరగంట తర్వాత మళ్ళీ చెప్పులు తొడుక్కుని బయటకి వచ్చింది. దగ్గరలో ఉన్న కిరాణా షాపునుంచి ఆఫీసుకి, బెనర్జీ గదిలోని పర్సనల్ నంబర్ కి ఫోన్ చేసింది. మోగుతూనే ఉంది. ఎవరూ ఎత్తలేదు.

డైరెక్టరీ అడిగి తీసుకుని అతని ఇంటి నంబరు చూసి ఇంటికి ఫోన్ చేసింది. అనసూయ ఫోన్ ఎత్తి 'హలో' అనగానే అడిగింది మైత్రి.

"బెనర్జీగారితో ఓసారి మాట్లాడచ్చా?"

"ఆయన ఇంట్లోలేరు. ఆఫీస్‌కి ఫోన్ చేయండి"

"ఆఫీస్‌లో కూడా లేరు"

"అయితే బయటకి వెళ్ళి ఉంటారు. ఎవరు మీరు?"

మైత్రికి తన పేరు చెప్పటం ఇష్టంలేక చెప్పింది.

"వ్యాపార పని మీద మాట్లాడాలనుకున్నారు మా బాస్. రాయల్ ఇండస్ట్రీస్ నుంచి"

"రాగానే చెపుతాను"

"ఎప్పుడు రావచ్చు?"

"సాధారణంగా అర్ధరాత్రికి కానీ రారు."

"థాంక్‌యూ."

ఫోన్ పెట్టేసింది. బెనర్జీ ఎక్కడికి వెళ్ళినట్టు? ఇది అతని పనేనా? సుధీర్‌ని కిడ్నాప్ చేసాడా? చేసి ఏం చేస్తాడు? నేనే నీ తండ్రిని అని పెంచుదామనా? అంత కంటే తెలివితక్కువ ఆలోచన ఇంకోటి ఉండదు. కానీ బెనర్జీ మనసులో ఓ ఆలోచనపడకూడదు. కానీ పడటం అంటూ జరిగితే చేసేదాకా నిద్రపోడు.

ఏడు దాటి ఎనిమిదయింది. శ్యామలాంబ భర్త కైలాసం వచ్చాడు. సుధీర్ గురించి తెలియగానే ఆయనా కంగారుపడ్డాడు.

తొమ్మిది దాటాక చెప్పింది శ్యామలాంబ.

"మళ్ళీ బెనర్జీకి ఓ సారి ఫోన్ చేసి చూడమ్మాయ్."

కిరాణా దుకాణం కట్టేస్తున్నారు కైలాసం ఫోన్ చేయ్‌డానికి వెళితే. ఆఫీస్‌కి, ఇంటికి ఫోన్‌చేసాడాయన బెనర్జీ కోసం. రెండుచోట్లా లేడతను.

"పోలీస్ రిపోర్ట్ ఇవ్వడం మంచిది " చెప్పాడాయన నీరసంగా.

"ఫస్ట్‌షోకి వెళ్ళాడేమో? ఇంకో గంటలో రావచ్చు. చూద్దాం" చెప్పింది మైత్రి.

పదిన్నరదాకా శ్యామలాంబ, మైత్రి వంట కూడా చేయకుండా అలాగే కూర్చున్నారు. మైత్రికి మనసు మనసులో లేదు. అది బెనర్జీ పని అయివుంటే సుధీర్ కేం కాదు, కాకపోతే, ఏదయినా చిక్కుల్లో పడ్డాడా? పిల్లల్ని ఎత్తుకెళ్ళేవాళ్ళ చేతుల్లో పడ్డాడా?

పదకొండింటికి కైలాసం చెప్పాడు.

"లాభం లేదు. పోలీస్ రిపోర్ట్ ఇచ్చి తీరాలి."

"పదండి. నేనూ వస్తాను" చెప్పింది మైత్రి చెప్పులు తొడుక్కుని.

"ఇంత కాఫీ త్రాగి వెళ్ళమ్మా! ఏం తినలేదు రెండు నిముషాల్లో కలిపి ఇస్తాను" చెప్పింది శ్యామలాంబ.

ఆవిడిచ్చిన కాఫీ తాగి ఇద్దరూ బయటకి వచ్చారు. ఇద్దరూ నడుస్తూ సందు చివర ఓ కారు ఆగడం చూసారు, కొన్ని క్షణాల్లో అది వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. ఆ సందులో సగం దూరం వెళ్ళగానే నడిచి వస్తున్న సుధీర్ వాళ్ళ కంట పడ్డాడు.

"అమ్మా!" అరిచి పరుగెత్తుకొచ్చాడు. సుధీర్‌ని ఒక్క ఉదుటున ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది మైత్రి.

"ఇంతసేపు ఎక్కడికి వెళ్ళావ్?" అడిగింది ఆదుర్దాతో కూడిన సంతోషంతో.

"అంకుల్ తీసుకెళ్ళారు" చెప్పాడు.

"ఏ అంకుల్."

"బెనర్జ్ అంకుల్."

"స్కూల్‌కి వచ్చా?"

"కాదు స్కూల్ విడిచిపెట్టాక ఇంటికి వస్తుంటే వచ్చి కారెక్కమన్నారు. మా అమ్మ కొడుతుంది రానన్నా బలవంతంగా తీసుకెళ్ళారు. ఇప్పుడాయనే తీసుకొచ్చి సందు చివర వదిలిపెట్టి వెళ్ళారు."

"ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు కైలాసం.

"వాల్ట్ డిస్నీ కార్టూన్ సినిమాకి. ఐస్ క్రీం పార్లర్‌కి. ఆలస్యం అయితే మా అమ్మ తిడుతుందమే నే చెపితే తిట్టదులే అన్నాడాయన."

"దిసీజ్ టూమచ్" చెప్పాడు కైలాసం.

"ఏమయితే ఏం. పిల్లాడు క్షేమంగా తిరిగొచ్చాడు" చెప్పింది మైత్రి రిలీఫ్‌గా ఫీలవుతూ.

శ్యామలాంబ జరిగింది విని చెప్పింది చిరాగ్గా.

"తీసుకెళ్ళదలచుకున్నవాడు ముందు చెప్పి తీసుకెళ్ళచ్చుగా! ఎంత ఆదుర్దాపడ్డాం."

***(ఇంకా ఉంది)***

Post your comments